# నిర్వహణ అధ్వానం


ఆస్పత్రి ఆవరణలో పడేసిన బయో మెడికల్ వేస్టేజీ


పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి

- దారుణంగా ప్రభుత్వ మానసిక ఆస్పత్రి పరిసరాలు
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు
- ఇలాగైతే ఎన్ఏబీహెచ్ హోదా కొనసాగేనా..?


నిరుపయోగంగా బయో మెడికల్ వేస్టేజీ బిన్స్


ఎన్ఏబీహెచ్ లోగోతో ఆస్పత్రి ప్రవేశ ద్వారం

**బీచ్ రోడ్డు :** నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ హోదా పొందిన అతి కొద్ది ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒకటైన పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి నిర్వహణ ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, బయో మెడికల్ వేస్టేజ్‌ను ఆస్పత్రి ఆవరణలోనే పడేయడం, రోగులకు సరైన సదుపాయలు కల్పించడంలో విఫలమవుతోంది. ఎంతో కష్టపడి సాధించిన ఎన్ఏబీహెచ్ హోదా ఇప్పుడు కొనసాగుతుందా..? అనే సందేహం కలుగుతోంది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆస్పత్రి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆస్పత్రులకు సాధ్యం కాని ఎన్ఏబీహెచ్ హోదా వచ్చేలా చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఆ హోదా కోల్పోయే పరిస్థితికి ఆస్పత్రి నిర్వహణ దిగజారిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. ఆస్పత్రిలో ఎక్కడ చూసినా చెత్త కనిపించడంతోపాటు మరుగుదొడ్ల నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేశారు.

**అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో...**

క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నడిచే ఎన్ఏబీహెచ్ హోదా అనేది ఆస్పత్రిలో రోగికి అందించే నాణ్యమైన వైద్యం, పరిసరాల్లో పాటించాల్సిన పరిశుభ్రత ఆధారంగా కల్పిస్తారు. బయో మెడికల్ వేస్టేజ్ వేరు చేసే పద్ధతి, రోగులకు సేఫ్టీతో కూడిన వైద్యం అందించడం.. ఇలా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ హోదా పొందడం అంటే అంతర్జాతీయ స్థాయిలో ఆస్పత్రికి గుర్తింపు లభించినట్లే. అటువంటి గుర్తింపును ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి తీసుకొచ్చేందుకు గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. అయితే ఇప్పుడు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల బయో మెడికల్ వేస్టేజీని ఆస్పత్రి ఆవరణలోనే పడేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆస్పత్రి పరిసరాల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి అధ్వానంగా తయారయ్యాయి.

**తీరు మారకపోతే హోదాకు ముప్పు**

మరికొన్ని నెలల్లో ఎన్ఏబీహెచ్ సభ్యులు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిని సందర్శించి హోదాను సమీక్షించనున్నారు. ఈలోగా ఉన్నతాధికారులు తీరు మార్చుకుని ఆస్పత్రి నిర్వహణపై శ్రద్ధ చూపకపోతే హోదా కొనసాగడం కష్టమేనని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని... రోగుల భద్రత, ఆస్పత్రిలో పరిశుభ్రత, బయో మెడికల్ వేస్టేజీ తరలింపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నారు. అలా చేస్తేనే ఎన్ఏబీహెచ్ హోదా కొనసాగుతుందని అంటున్నారు.

### అధ్వానంగా మరుగుదొడ్లు

ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. సరైన నిర్వహణ లేక మూత్ర విసర్జన బేషిన్, వాష్ బేషిన్ వంటి వాటికి నీటి సదుపాయం లేదు. దీంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే వాటికి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.


నీటి సదుపాయం లేని వాష్‌బేషిన్, పని చేయని మూత్ర విసర్జన బేషిన్

### ఎక్కడికక్కడే బయో మెడికల్ వేస్టేజీ

ఎన్ఏబీహెచ్ హోదా కల్పనలో అత్యంత కీలకమైనది బయో మెడికల్ వేస్టేజీ నిర్వహణ. దీన్ని వేరు చేసి, తరలించే విషయంలో ఆస్పత్రి ఉన్నాతాధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కింది స్థాయి సిబ్బంది వాటిని ఎక్కడపడితే అక్కడే విసిరేస్తున్నారు. ముఖ్యంగా ఆస్పత్రి వెనుక వైపు పెద్ద మొత్తంలో బయో మెడికల్ వేస్టేజీ దర్శనమిస్తోంది. మందులు, ఇంజక్షన్లు, ఇతర సామగ్రిని ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. ఎన్ఏబీహెచ్ నిబంధనల ప్రకారం బయో మెడికల్ వేస్టేజీని మూడు రకాలుగా విభజించాలి. అందుకోసమని ఆస్పత్రి ఆవరణలో మూడు రంగులతో బయో మెడికల్ వేస్టేజీ బిన్స్‌ను శ్వాశతంగా నిర్మించారు. అయితే వాటిని మాత్రం ఆస్పత్రి సిబ్బంది వినియోగించడం లేదు. ఎక్కడపడితే అక్కడే చెత్తను పడేస్తున్నారు. ఆ బయో మెడికల్ వేస్టేజీ బిన్స్ ఉన్న స్థలాన్ని వాహనాల పార్కింగ్ స్థలంగా వినియోగించుకుంటున్నారు.


ఆస్పత్రి ఆవరణలో పడేసిన బయో మెడికల్ వేస్టేజీ

## క్లుప్తంగా

### క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయి


బాలుర గృహంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

**ఆరిలోవ :** క్రమశిక్షణ కలిగిన వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. చినగదిలి దరి దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర గృహాన్ని ఆయన బుధవారం సందర్శించారు. గృహంలో ఎంత మంది బాలురు ఉన్నారు... వారంతా ఏయే ప్రాంతాలకు చెందినవారు తదితర విషయాలు పర్యవేక్షణాధికారి రమణను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన బాలురతో మాట్లాడారు. వారి కుటుంబ నేపథ్యం తెలుసుకున్నారు. బాలురు గృహంలో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకోవడం వల్ల మంచి ఉద్యోగాలు సాధించి భవిష్యత్‌లో చక్కగా స్థిరపడతారన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సిబ్బంది, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

### భవిత కేంద్రం పిల్లలకు స్పీచ్ థెరపీ


భవిత కేంద్రంలో పిల్లలకు స్పీచ్ థెరపీ చేయిస్తున్న నిపుణురాలు బాలేశ్వరి

**ఆరిలోవ :** జీవీఎంసీ పదో వార్డు పరిధి తోటగరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలో దివ్యాంగులకు బుధవారం స్పీచ్ థెరపీ చేయించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ ఆదేశాలతో ఇక్కడి కేంద్రంలో 25 మంది పిల్లలకు స్పీచ్ థెరపీ నిపుణురాలు బాలేశ్వరి భాష ఉచ్చరణలో తర్ఫీదు ఇచ్చారు. తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలకు ఆమె మెలకువలు నేర్పించారు. భాష ఉచ్చరణ సరిగా లేని పిల్లలను తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తుండాలని సూచించారు. ఈ సందర్భంగా చినగదిలి ఎంఈవో – 2 అనురాధ మాట్లాడుతూ అన్ని మండలాల్లోనూ స్పీచ్‌థెరపీ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నజ్మా, కేంద్రం ఉపాధ్యాయులు సలీమా, శాంతి పాల్గొన్నారు.

### వీఎంఆర్‌డీఏ చైర్మన్‌ను కలిసిన డీఎస్‌డీవో


ప్రణవ్‌గోపాల్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు

**విశాఖ సిటీ :** వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్‌ను జిల్లా క్రీడల అధికారి (డీఎస్‌డీవో) ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలో క్రీడా కార్యక్రమాల నిర్వహణ, వసతులపై చర్చించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పని చేస్తున్న ఉద్యోగులకు ఆగస్టు నెలలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని, వాటి నిర్వహణకు సహకరించాలని చైర్మన్ కోరారు.

### యువజన దినోత్సవ పోస్టర్ విడుదల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

**మద్దిలపాలెం :** అంతర్జాతీయ యువజన దినోత్సవం – 2025 ఉత్సవాల పోస్టర్‌ను ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ బుధవారం విడుదల చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు 12న ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ఇంటర్ ఫెయిత్ డైలాగ్, యూత్ ఎంగేజ్మెంట్ ప్రోగ్రాంతో కొనసాగనుంది. ఈ కార్యక్రమాన్ని యోస్ వి కేన్ యువజన సంస్థ (విశాఖపట్నం), ఆర్థికశాస్త్ర విభాగం, ఆగ్రో ఎకనామిక్ రీసెర్చ్ సెంటర్ (భారత ప్రభుత్వం), ఆంధ్ర విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించనున్నాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి.లిల్లీ గ్రేస్ యూనిస్, ప్రొఫెసర్ డి.ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ చంద్రబాబు మోసాలు, అరాచకాలు


జీవీఎంసీ 15వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న మాజీ కార్పొరేటర్ నడింపల్లి క్రిష్ణంరాజు, నాయకులు


22వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న పీతల గోవింద్


23వ వార్డులో కరపత్రాలు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**మద్దిలపాలెం :** 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని జీవీఎంసీ 15వ వార్డు 277వ నంబరు బూత్ పరిధిలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి, మాజీ కార్పొరేటర్ నడింపల్లి క్రిష్ణంరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది పాలనలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. అందుకు సంబంధించిన కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో పీల ప్రేమ్ కిరణ్, వార్డు అధ్యక్షుడు కణితి మరియదాస్, బీసీ సెల్ అధ్యక్షుడు బుగత యేసురత్నం, మహిళా విభాగం అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, వార్డు ఉపాధ్యక్షుడు కుదిరిల్ల వెంకట్రావు, నూకరాజు, మారడపూడి వేలంగని, సిరిపురం జగదీశ్వరరావు, రాజారావు, జగదీష్, జనార్ధనమ్మ, మహాలక్ష్మి, కళ్యాణి పాల్గొన్నారు.

- జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలో గల 225వ నంబరు బూత్ పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి బాబు చేసిన మోసాలు, ప్రభుత్వ అరాచకాలు ఆయన వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీతల మహేష్, చంద్రరావు, అన్నపూర్ణ, నిట్ట వెంకటరావు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 23వ వార్డులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బూస రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు చేసిన మోసాలను ఆయన గడపగడపకూ వెళ్లి ప్రజలకు వివరించారు. అనంతరం కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకులు బోర కుమార్ రెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, పులగం శ్రీనివాస్ రెడ్డి, కొయ్య శశికళ, నగిరెడ్ల పోలిశెట్టి, గుడ్ల గణేష్ రెడ్డి, కైలాష్ రెడ్డి, పులగం కొండారెడ్డి, ఏరుసు అరుణ, బోయి రమణ రెడ్డి, బోయి త్రినాథ్ రెడ్డి, గుమ్మడి మని, గుదే శ్రీను, బోరా రామిరెడ్డి, దుర్గ శ్రీనివాస్, సుజాత, పిన్నింట్ల నర్సింగ్ రెడ్డి, కేవీ రమణ, పిట్ట జగదీష్ రెడ్డి, పిలక మధుసూదన్ రెడ్డి, సిరపు రామలక్ష్మి, కొనిసి సూర్యనారాయణ, పుట్ట రమణమ్మ, బోర రాముదెడ్డి, సరగడ రమణమ్మ, ఎరుసు మంగ, చిల్ల ఎల్లయ్య, సాల చిన్ని, అచ్చి సుధీర్ రెడ్డి, చిల్ల నారాయణరావు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు దివ్య ఔషధం

- బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలి
- తల్లిపాల వారోత్సవాల్లో విస్తృత ప్రచారం


తల్లిపాలపై అవగాహన ర్యాలీలో ఐసీడీఎస్ సిబ్బంది

**మద్దిలపాలెం :** బిడ్డ పుట్టిన వెంటనే నవజాత శిశువుకు ముర్రుపాలు అందిస్తే అనారోగ్య సమస్యలు దరి చేరవు. పిల్లలకు తల్లి ఒడిలో ఇచ్చే పాలు అమృతంతో సమానం. మాతృత్వాన్ని పంచే తల్లి... బిడ్డకు పాలు ఇవ్వడంలో చూపించే నిర్లక్ష్యం ఆ పండంటి బిడ్డ ఆరోగ్యానికి హానికరం. ప్రతి చిన్నారికి తల్లిపాలు తప్పసరిగా అందించాలి. దీనిపై తల్లులకు అవగాహన కల్పించేందుకు బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్వర్క్ ఆఫ్ ఇండియా ఏటా ఆగస్టు ఒకటో తేదీ నుంచి 7 వరకూ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తోంది. తల్లిపాలలో చిన్నారులకు అవసరమైన పోషకాలు పుష్కలంగా లభిస్తాయని... పుట్టినప్పటి నుంచి రెండేళ్ల వయసు వచ్చే వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని.. బిడ్డ ఎదుగుదలకు అవసరమైన ప్రోటీన్లు పోషకాలు, మాంసకృత్తులు లభిస్తాయని అవగాహన కల్పిస్తున్నారు.

**తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో మేలు**

బిడ్డ పుట్టిన తర్వాత తొలి రెండు రోజులపాటు లభించే ముర్రు పాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠం. వాటిలో రోగనిరోధక శక్తి అధికంగా ఉండడంతో బిడ్డలు వ్యాధుల బారిన పడకుండా నివారించడంలో ఎంతో దోహదపడుతుంది. భవిష్యత్‌లో గుండె జబ్బులు, అధిక రక్తపోటు, డయాబెటిస్ వంటివి దరిచేరవని వైద్యుల పరిశోధనల్లో తేలింది. పిల్లల ఎదుగుదలకు దోహదం చేయడంతోపాటు ఎముకలకు బలాన్ని అందిస్తుంది. మరోవైపు బిడ్డకు పాలు తాగించడం వల్ల తల్లి ఆరోగ్యానికీ మంచిదే. కాన్పు తర్వాత వచ్చే కొన్నిరకాల మానసిక సమస్యలు దూరమవుతాయి. పాలిచ్చే స్త్రీలలో రొమ్ము, అండాశయ క్యాన్సర్ ముప్పు తక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. బిడ్డ పుట్టిన తర్వాత కొందరు తల్లులు అపోహలతో బిడ్డకు పాలివ్వడం మానేస్తున్నారు. చిన్నారుల ఆరోగ్యానికి చేతులరా హాని కలిగిస్తున్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది. ఇవ్వకపోతే ఇద్దరి ఆరోగ్యానికి ఇబ్బందికరంగా ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు.

### విస్తృతంగా అవగాహన సదస్సులు

తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా విశాఖ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, చినగదిలి, టి.ఆర్.నగర్, సింహాచలం, మర్రిపాలెం, కె.జె.పేట, మల్కాపురం సెక్టారులో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రతి సెక్టార్ పరిధిలో ఒక మెగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నాం. ఈ సదస్సుల్లో మాతా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలక్ష్మి, పిల్లల వైద్య నిపుణులు పాల్గొని తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్నారు. ర్యాలీ, ఎగ్జిబిషన్, సెల్ఫీ స్టాండ్‌లు ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం.


– నీలిమ, ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అధికారి

## ఘనంగా గురువులకు వందనం వేడుకలు


విజయ జ్యోతిని సత్కరిస్తున్న అతిథులు

**మద్దిలపాలెం :** విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గురువులకు వందనం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ ఉష పేరిట సీనియర్ కూచిపూడి నాట్యకళాకారిణి బి.విజయ జ్యోతికి ఉష జీవిత సాఫల్య పురస్కారం అతిథుల చేతుల మీదుగా అందించి ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్రకు చెందిన 22 మంది గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పైడా క్రిష్ణ ప్రసాద్, డాక్టర్ శ్రీధర్ మిత్ర, కూచిపూడి కళాక్షేత్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్, విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, అధ్యక్షులు హరి రామమూర్తి, సింధుజ, గోపీనాథ్, మహాలక్ష్మి, రాగా, కళ్యాణి పాల్గొన్నారు.

## ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం


క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

**మద్దిలపాలెం :** బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం కోర్సుకి సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని చెప్పారు. అదేవిధంగా నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. దీనికి సంబంధించి ఏయూలో ప్రత్యేక ల్యాబ్, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకోసం పలు ప్రతిపాదనలు సిద్ధం చేసి దరఖాస్తు చేశామని చెప్పారు. ఈ రంగంలో ఆచార్యులను నిపుణులుగా తీర్చిదిద్దడానికి త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు. విభిన్న విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశ్రమల నిపుణులు ఆచార్యులకు శిక్షణ అందిస్తారని వీసీ రాజశేఖర్ తెలిపారు.

## 45 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

**ఎంవీపీ కాలనీ :** ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాలరిపేటలో 45 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు ఎంవీపీ పోలీసులతోపాటు పౌరసరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ సర్కిల్ – 2 నమ్మి నరేష్‌బాబు తదితరులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. బొలేరో వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న సూరి జగన్నాథరావు(65), అతని కుమారుడు మోహన్ పట్టుబడ్డారు. వారు తరలిస్తున్న వాహనంలో 45 బస్తాల (2250 కేజీల) పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. దీంతో బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గణేష్ ఉత్సవ కమిటీలతో సమావేశం నేడు

**ఆరిలోవ :** ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది గణేష్ ఉత్సవాలు నిర్వహించనున్న ఉత్సవ కమిటీల ప్రతినిధులతో పోలీసులు గురువారం సమావేశం నిర్వహించనున్నారు. నగరమంతటికీ పోలీస్ కమిషనరేట్‌లో టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ హాల్‌లో జరగనున్న సమావేశానికి ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని సీఐ హెచ్.మల్లేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరగనున్న సమావేశంలో ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

## అణ్వస్త్ర రహిత సమాజంతోనే శాంతి సాధ్యం


అణ్వస్త్ర దాడికి సంబంధించి ఫొటోలు తిలకిస్తున్న విద్యార్థులు

**ఎంవీపీ కాలనీ :** అణ్వాస్త్రాల రహిత సమాజంతోనే ప్రపంచ శాంతి స్థాపన సాధ్యమవుతుందని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ (ఐఏఆర్ఎఫ్) చైర్మన్ నరవ ప్రకాశరావు అన్నారు. 1945 ఆగస్టు 6న జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అనుబాంబు దాడులను పురస్కరించుకుని బుధవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు యుద్ధాలకు స్వస్తి పలికి శాంతి కోసం కృషి చేయాలన్నారు. జపాన్‌పై జరిగిన అణుదాడి మానవాళికి చేసిన నష్టాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. మరోసారి ఇలాంటి ఘోర తప్పిదం ప్రపంచంలో ఎక్కడా జరగకుండా అణ్వాయుధాలను ప్రపంచ దేశాలు నిషేధించాలన్నారు. అనంతరం జపాన్‌లో జరిగిన అణుదాడికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు తిలకించారు. కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరరావు, డాక్టర్ అప్పారావు, ప్రియాంక పాల్గొన్నారు.

## ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

**ఎంవీపీ కాలనీ :** ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2025 జూలై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గతంలో ప్రకటించిన గడువు ఇటీవల ముగియడంతో ఆగస్టు 15 వరకు పొడిగించారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలోని ఇగ్నో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.